ఖమ్మంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు

'పొట్టి' పేరు మారిస్తే తీవ్ర పరిణామాలు

- తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరు ఉంచాల్సిందే..
- గతంలో ఏ ప్రభుత్వమూ పేరు మార్చే ప్రయత్నం చేయలేదు
- ఖమ్మం సమావేశంలో ఆర్యవైశ్యుల ఆగ్రహం

ఖమ్మం, మార్చి 16: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మరిచిందని ఖమ్మానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు మండిపడ్డారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి కాంగ్రెస్ నేత గీతా రెడ్డి మాతృమూర్తి ఈశ్వరీబాయి పేరు పెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేస్తున్న అడుగులు ఆక్షేపణీయమైనవని పేర్కొన్నారు. ఖమ్మంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా, నగర కమిటీ సమావేశంలో సంఘం నేతలు మాట్లాడారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తించిన గత ప్రభుత్వాలు.. వర్సిటీకి ఉన్న ఆయన పేరును తొలగించేందుకే ఏనాడూ ప్రయత్నించలేదని గుర్తుచేశారు. అమరజీవి పేరు మార్చే ప్రయత్నం చేస్తే తెలుగు రాష్ట్రాల్లోని ఆర్యవైశ్యుల ఆగ్రహాన్ని చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఎల్లమ్మతల్లీ.. సీపీఎస్ రద్దు చేయమ్మా!

- ఎన్‌వోపీఆర్‌యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాచన రఘునందన్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): భాగస్వామ్య పింఛను పథకం (సీపీఎస్) రద్దు కావాలని ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసినట్టు నేషనల్ ఓల్డ్ పెన్షన్ రెస్టోరేషన్ యునైటెడ్ ఫ్రంట్ (ఎన్‌వోపీఆర్‌యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మాచన రఘునందన్ తెలిపారు. బల్కంపేట ఎల్లమ్మతల్లి ఆలయంలో సీపీఎస్ రద్దు కోరుతూ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ రద్దు కోసం ఈనెల 23న చలో ఢిల్లీ కార్యక్రమం తలపెట్టామని, అది విజయవంతం కావాలని అమ్మవారిని వేడుకున్నామని వెల్లడించారు. కేంద్రంలోని పాలకులు ఎప్పటికప్పుడు సీపీఎస్ రద్దు చేస్తామని పబ్బం గడుపుతున్నారే తప్ప.. పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించేలా పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఆలయాల్లో పూజలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంగ చంద్రకళ, వల్లకాటి నారాయణ, మోర మౌనిక, దాసరి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకుల టీచర్లకు శిక్షణ

- విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై ప్రత్యేకంగా దృష్టి
- మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని నిర్ణయం

హైదరాబాద్, మార్చి16 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో చోటుచేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడంలో భాగంగా మానసిక ఆరోగ్యంపై టీచర్లకు శిక్షణ ఇవ్వాలని ఎస్సీ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గురుకులంలో విద్యార్థుల ఆత్మహత్యలను కట్టడి చేయాలనే దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఆ ముందస్తు చర్యల్లో భాగంగా గురుకుల విద్యార్థుల మానసిక ఆరోగ్యం, పరివర్తనపై గురుకులాల్లో టీచర్లకు శిక్షణకు సంకల్పించామని వెల్లడించారు. మ్యాజిక్ ఆఫ్ ఛేంజ్ సంస్థతో కలిసి టీచర్లకు శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఎంసీహెచ్‌ఆర్‌డీలో సోమ, మంగళవారం మొదటి విడతలో 120 మంది, 19, 20 తేదీల్లో 118 మందికి శిక్షణ కొనసాగుతుందని వివరించారు.

ఉచితాలిస్తరు.. జీతాలియ్యలేరా?

నాడు హామీలిచ్చి నేడు తప్పించుకుంటారా? ● ఉద్యోగులను ఇంత మోసం చేస్తరా?

హామీలిచ్చినప్పుడు ఆర్థిక పరిస్థితి తెలియదా? ● అధికారం చేపట్టాక మోసం చేద్దామనుకున్నారా?

- విద్యకు, వైద్యానికో ఎక్కువ ఖర్చు చేస్తామంటే రెండు గంటలేంటి.. రేయింబవళ్లు పనిచేస్తం
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ఉద్యోగుల మండిపాటు
- చేతగాకపోతే దిగిపోండి అంటూ హెచ్చరికలు

'ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలిస్తాం. పెండింగ్ డీఏలను తక్షణమే చెల్లిస్తాం. పెండింగ్ బిల్లులను 15 రోజుల్లో చెల్లిస్తాం. సీపీఎస్‌ను రద్దు చేస్తాం' ఇవీ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు.

'ప్రతి నెల ఒకటో తేదీన జీతాలివ్వడానికే తలప్రాణం తోకకొస్తున్నది. అప్పటికప్పుడు జీతాలిచ్చేందుకు రూ.4 వేల కోట్లు ఆర్బీఐ దగ్గర చేబదులు తీసుకుని సర్దినం. జీతాలు తీసుకుని సేవచేయండి, అదనంగా ఏం కోరికలు కోరకండి. అన్ని లెక్కలు మీ ముందే పెడతా. డీఏల కోసం ధర్నాలు, దీక్షలు, బంద్‌లు, పెన్‌డౌన్ చేస్తమనుకుంటే, ఏది డౌన్ అన్నా.. మొత్తం ప్రభుత్వమే డౌన్ అయ్యిద్ది. అమ్మిపెడదామన్నా మాదగ్గరేం లేదు. మా సొంతానివి అమ్మిపెట్టినా దేనికీ సరిపోవు. జపాన్‌లో నిరసన తెలపాలంటే రెండు గంటలు అదనంగా పనిచేస్తరు. ప్రభుత్వ ఉద్యోగులు రోజుకు రెండు మూడు గంటలు అదనంగా పనిచేసి ఆదాయాన్ని పెంచితే మంచిది'– ఇవీ శనివారం శాసనమండలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు. ఇటీవల రవీంద్రభారతిలో నిర్వహించిన సమావేశంలోనూ సీఎం ఇదే తరహాలో మాట్లాడారు.

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలు, కాంగ్రెస్ సర్కారు తీరుపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడ్డగోలు హామీలిచ్చి ఇప్పుడింత మోసమా? అని ప్రశ్నిస్తున్నారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ప్రసంగంపై ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికలు, వాట్సాప్ గ్రూపుల్లో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సీఎం వ్యవహారం చూస్తుంటే 'ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్' చేస్తున్నట్టుగా ఉన్నదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.



డీఏలు చెల్లించాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు విన్నవిస్తున్న ఉద్యోగ సంఘాలు (ఫైల్)

చేతగాకపోతే దిగిపోండి

'అధికారంలోకి రాకముందు అలవిగాని హామీలిచ్చారు. హామీలు ఇచ్చేటప్పుడు ఆర్థిక పరిస్థితి తెలియదా? తెలియక హామీలిచ్చారా? లేక అధికారంలోకి వచ్చాక మోసం చేయవచ్చులే అన్న ధీమాతో ఇలా చేశారా?' అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. 'బస్సు ఫ్రీ, కరెంటు ఫ్రీ, అది ఫ్రీ.. ఇది ఫ్రీ.. అంటూ ఉచితాలు ఎవరు ఇవ్వమన్నరు. మీ తప్పిదాలకు మమ్మల్ని శిక్షిస్తరా? అధికారం చేజిక్కించుకునేందుకు ఆశలు రేకెత్తించి, ఉద్యోగుల ఓట్లు వేయించుకొని ఇంత మోసం చేస్తరా?' అని మండిపడుతున్నారు. 'డీఏలు ఇవ్వలేమని అంటున్నరు. డీఏ అంటే నిజ జీతంలో పెరుగుదల కాదు సార్. పడిపోయిన రూపాయి విలువకు సమానంగా ఇచ్చే పరిహారం. నాలుగు డీఏలు అంటే రెండేండ్లలో పడిపోయిన రూపాయి విలువ పరిహారాన్ని మేం అందుకోలేదు. ఈ పరిహారాన్ని పొందడం మా హక్కు' అంటూ ఉద్యోగులు సోషల్‌మీడియాలో సర్కారుపై దుమ్మత్తిపోస్తున్నారు. 'ఉచితాలిస్తరు కానీ, జీతాలివ్వలేరా? పెండింగ్ బిల్లులు చెల్లించలేరా? డీఏలు ఇవ్వలేరా? పీఆర్సీ ప్రకటించలేరా? హెల్త్‌కార్డులు ఇవ్వలేరా? ఇవన్నీ చేతగాకపోతే మా వల్ల కాదని దిగిపోండి' అంటూ సర్కారుకు సూచిస్తున్నారు.

సీఎం మాటల నేపథ్యంలో ఉద్యోగుల స్పందనలు

- పెరిగిన ఆదాయం ఉచితాలకు కాకుండా అభివృద్ధికో, విద్యకో, వైద్యానికో ఉపయోగిస్తామంటే రెండు గంటలు ఎక్కువ ఏంటీ సార్.. రేయింబవళ్లు పనిచేస్తం.
- మేము రెండు గంటలు ఎక్కువ పనిచేస్తే మరో రెండు ఉచితాలు పెంచుతారు తప్ప, మమ్మల్ని మాత్రం రేవులో ముంచరన్న నమ్మకమేంటి?
- ఆరు గ్యారెంటీలు ఇచ్చినప్పుడు ఆరు డీఏలు పెండింగ్‌లో పెడతారనుకోలేదు.
- ప్రజాపాలన అంటే ఉచితాలు పెంచడం, ఉద్యోగులను ముంచడమేనా? మా పరిస్థితి ఏరికోరి తెచ్చుకున్న మొగుడు ఎగిరెగిరి తన్నినట్టయ్యింది.
- ఆయ్యా సీఎం గారూ.. కోరికలకు, హక్కులకు తేడాలు తెలియవా? మేమేం కోరికలు కోరడంలేదు. హక్కుల గురించి అడుగుతున్నం.
- మీ జీతం అక్షరాలా రూ.రెండు లక్షలు. రూ.30 వేలు వచ్చే ఉద్యోగికి డీఏ ఇవ్వరా? పీఆర్సీ ప్రకటించరా?
- ఇప్పుడు డీఏలు ఇవ్వమన్నారు. రేపు పీఆర్సీ ఇవ్వమంటారు. ఆ తర్వాత జీతం కూడా ఇవ్వలేమంటారేమో? ఇదేం పాలన?
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జీతాలు వదులుకోండి. మీరెందుకు తీసుకుంటున్నారు?

ఉద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి, ఆరు నెలల్లోపు సిఫారసులను అమలుచేస్తాం.
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చే డీఏలను సకాలంలో ప్రకటించి, బకాయిలను నేరుగా ఉద్యోగులకు చెల్లిస్తాం.
- కంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్) విధానాన్ని రద్దుచేసి, ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్) విధానాన్ని అమలుచేస్తాం.
- ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే చెల్లిస్తాం.
- జీవో–317ను సమీక్షించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం.
- ఉద్యోగులు, టీచర్ల బదిలీలకు ట్రాన్స్‌ఫర్ క్యాలెండర్‌ను ప్రకటించి. ఏటా వేసవిలో బదిలీలు చేపడతాం.
- ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌తో అన్ని రకాల జబ్బులకు, అన్ని దవాఖానల్లో వైద్యం అందించే విధంగా హెల్త్‌కార్డులు జారీచేస్తాం.
- ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు, ఐకేపీ, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తాం.
- అర్బన్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్ తీసుకొచ్చి, 150 రోజులు పనికల్పిస్తాం. కనీస వేతనాన్ని రూ.350కి పెంచుతాం.

హామీలిచ్చి తప్పించుకుంటారా?

- డీఏలు, పీఆర్సీలు అడగొద్దన్న సీఎం వ్యాఖ్యలపై పెన్షనర్ల జేఏసీ ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లకు హామీలిచ్చి తప్పించుకుంటారా? అని పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి(పెన్సనర్స్ జేఏసీ) సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించింది. ఉద్యోగులు, పెన్షనర్లు డీఏలు, పీఆర్సీలు అడగొద్దన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై భగ్గుమన్నది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన పెన్షనర్స్ జేఏసీ కోర్ కమిటీ సమావేశంలో సీఎం వ్యాఖ్యలపై చర్చించారు. 'జీతాలు ఇచ్చేందుకే తల ప్రాణం తోకకు వస్తుంది' అన్న సీఎం మాటలను తీవ్రంగా ఖండించింది. అదిగో పీఆర్సీ, ఇదిగో డీఏ అంటూ సాగదీసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఇవ్వలేమనడం దారుణమని మండిపడింది. ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో అనేక హామీలిచ్చి, ఇప్పుడేమో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని తప్పించుకోవడాన్ని జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టీ శుభాకర్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజలకు ఉచితాలు, సంక్షేమ పథకాలు ఇస్తున్నారని, ఉద్యోగులూ ప్రజలేనని, కనీసం మూడు డీఏలైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షనర్ బెనిఫిట్స్ అందజేయాలని, అన్ని దవాఖానల్లో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అమలుచేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ కో చైర్మన్లు సూర్యనారాయణ, రాజేంద్రబాబు, భరత్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, తులసి సత్యనారాయణ పాల్గొన్నారు.

బోగస్ విత్తన కంపెనీలపై చర్యలు

- 'నకిలీ'తో 2,700 ఎకరాల్లో పంట నష్టం: అన్వేశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బోగస్ విత్తనోత్పత్తి కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హాకాభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో పలు కంపెనీలు నకిలీ విత్తనాలతో రైతులను నట్టేట ముంచినట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇటీవల మంత్రి తుమ్మల, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆదేశాలమేరకు ఆయా మండలాల్లో పర్యటించగా ఈ విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. సింజెంట, హైటెక్, బేయర్ అనే మూడు మల్టీనేషనల్ కంపెనీలు ఈ మోసాలకు పాల్పడుతున్నట్టు వెల్లడించారు. ఈ కంపెనీల నకిలీ విత్తనాల కారణంగా 2,700ఎకరాల్లో రైతులు నష్టపోయినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చామని ప్రకటించారు. త్వరలోనే నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తామని చెప్పారు. బోగస్ కంపెనీలను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు.

'మాడల్' టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : మాడల్ స్కూల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. 010 పద్దు ద్వారా వేతనాలు, నోషనల్ సర్వీసు, ఇంక్రిమెంట్, హెల్త్‌కార్డుల కోసం ప్రయత్నిస్తానని చెప్పారు. ప్రోగ్రెసివ్ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (పీఎంటీఏటీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలు పెండింగ్ సమస్యలను శ్రీపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఈ మేరకు ఆయన స్పందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి, పీఎంటీఏటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరాల జగదీశ్, అనుముల పోచయ్య, సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాము, స్లీవ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రం

'కోర్ట్' సినిమా నన్ను గెలిపించింది

'నేను ఈ రోజుదాకా స్క్రిప్ట్, ప్రేక్షకులు.. ఈ రెండు విషయాలనే నమ్మాను. స్క్రిప్ట్ మా టీమ్‌ని గెలిపించింది. ప్రేక్షకులు సినిమాను గెలిపించారు. 'కోర్ట్' సినిమా నన్ను గెలిపించింది. ఈ సినిమా విషయంలో నేను గర్వంగా ఫీలవుతున్నాను. రానున్న రోజుల్లో 'కోర్ట్' పేరు మారుమ్రోగుతుంది. ఈ సినిమా విజయానికి కారకులైన అందరికీ పేరుపేరున థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని హీరో నాని అన్నారు. ఆయన సమర్పణలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో రామ్ జగదీష్ తెరకెక్కించిన చిత్రం 'కోర్ట్– స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. దీప్తి గంటా సహ నిర్మాత. ఈ నెల 14న విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలో నాని మాట్లాడారు. 'బలగం' తర్వాత తనకు దొరికిన గొప్ప అవకాశం 'కోర్ట్' సినిమా అని హీరో ప్రియదర్శి అన్నారు. పాతికేళ్లుగా మంగపతి లాంటి పాత్రకోసం ఎదురుచూస్తున్నానని, నాని తెలుగు సినిమాకు మరో సూపర్‌స్టార్ కృష్ణ అని నటుడు శివాజీ కొనియాడారు. నాని ప్రొడక్ట్‌ని అని చెప్పుకోడానికి ఒక దర్శకునిగా గర్విస్తానని దర్శకుడు రామ్‌జగదీష్ అన్నారు. ఇంకా నటులు శుభలేఖ సుధాకర్, హర్షవర్ధన్, రోషన్, నటి శ్రీదేవి, సహ నిర్మాత దీప్తి గంట, సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ తదితరులు మాట్లాడారు.

ఆట కూలీగా రామ్‌చరణ్?



కూలీల గురించి అందరికీ తెలుసు. కష్టపడి చమటోర్చి బ్రతుకుతుంటారు. మరి ఆట కూలీల గురించి ఎందరికి తెలుసు? అసలెవరీ ఆట కూలీ?.. అనే విషయానికొస్తే.. ఐపీఎల్‌లో ఆటగాళ్లను ఎలాగైతే కొనుక్కుంటారో.. అలా కొందర్ని కొనుక్కొని, వాళ్లతో ఆటాడించి, వాళ్లపై బెట్టింగులు కాసి డబ్బు సంపాదించే సంస్కృతి రూరల్‌లో ఉంది. అలా కొనుక్కోబడ్డవాడే 'ఆట కూలి'. ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలో రామ్‌చరణ్ ఆట కూలీగా కనిపించనున్నారట. ఇందులో కథ రీత్యా రామ్‌చరణ్ అన్ని ఆటల్లో నిష్ణాతుడై ఉంటాడట. అందుకే.. క్రికెట్, కుస్తీ, కబడ్డీ.. ఇలా అన్ని ఆటలూ ఈ కథలో మిళితమై ఉంటాయట. గ్రాఫిక్స్ జోలికి పోకుండా, గ్రాండియర్‌గా సెట్లేయించేస్తూ ఇప్పటికే కొంతమేర షూట్‌ని బుచ్చిబాబు కానిచ్చేశారట. దానికోసం నిర్మాతలు కూడా భారీగానే ఖర్చు పెడుతున్నారని సమాచారం. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఈ సినిమాలో దిగ్గజ క్రికెట్ ఆటగాడు మహేంద్రసింగ్ ధోనీ కీలకపాత్ర పోషించనున్నారట. ధోనీకి జనాల్లో ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. నిజంగా ధోనీ ఇందులో భాగమైతే ఈ సినిమా మైలేజీ వేరేలా ఉంటుంది. ఈ ఏడాది చివర్లో సినిమాను రిలీజ్ చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నదట ఈ సినిమా టీమ్. కథానాయికగా జాన్వీ కపూర్ నటిస్తున్న ఈ సినిమాలో కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంగీతం ఏ.ఆర్.రెహ్మాన్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, నిర్మాణం: మైత్రీ మూవీమేకర్స్.

ఖురేషి అబ్రహం ఆగమనం..

దిగ్గజ నటుడు మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'లూసిఫర్' సినిమా ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఆ సినిమాకు సీక్వెల్‌గా రూపొందిన 'ఎల్2 ఎంపురాన్' సినిమా ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఖురేషి అబ్రహం అలియాస్ స్టీఫెన్ నెడుంపల్లిగా మళ్లీ తెరపై మోహన్‌లాల్ నటవిశ్వరూపం చూపించనున్నారని, తొలి భాగాన్ని మించేలా ఈ మలి భాగం రూపొందిందని మేకర్స్ చెబుతున్నారు. సిమ్లా, లేహ్, యునైటెడ్ కింగ్‌డమ్, గుజరాత్, హైదరాబాద్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ముంబై, కేరళలోని పలు ప్రదేశాల్లో చిత్రీకరణ జరిగిందని, సాంకేతికంగా ఓ అద్భుతాన్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. పృథ్వీరాజ్ సుకుమారన్, టోవినో థామస్, జెరోమ్ ఫ్లిన్, అభిమన్యుసింగ్, ఆండ్రియా తివాదర్, సూరజ్ వెంజరమూడు, ఇంద్రజిత్ సుకుమారన్, మంజు వారియర్, సానియా అయ్యప్పన్, సాయికుమార్, బైజు సంతోష్, ఫాజిల్, సచిన్ ఖేడేకర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ పానిండియా సినిమాకు కెమెరా: సుజిత్ వాసుదేవ్, సంగీతం: దీపక్ దేవ్. నిర్మాతలు: సుభాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్.

సెంటిమెంట్ కలిసొస్తుందా?

క్వాంటిటీ కన్నా.. క్వాలిటీకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నది మలయాళ మందారం అనుపమ పరమేశ్వరన్. దీనివల్ల సినిమాల సంఖ్య తగ్గుతున్నా.. మంచి పాత్రలు ఆమె పరమవుతున్నాయి. రీసెంట్‌గా 'రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్'లో అద్భుతమైన పాత్రలో కనిపించి యూత్‌ని ఓరేంజ్‌లో ఆకట్టుకున్నది అనుపమ. ఇదిలావుంటే.. ఇటీవలే ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించేందుకు ఈ అందాలభామ పచ్చజెండా ఊపేసిందట. ఆ వివరాల్లోకెళ్తే.. శర్వానంద్ కథానాయకుడిగా సంపత్‌నంది ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఆ సినిమాలో కథానాయికగా అనుపమ పరమేశ్వరన్ ఎంపికైంది. ఇటీవలే అనుపమకు దర్శకుడు సంపత్‌నంది కథ కూడా వినిపించారట, తన పాత్ర బాగా నచ్చడంతో అనుపమ ఓకే చెప్పేసిందట. శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ కలిసి నటించిన 'శతమానం భవతి' సినిమా ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. మళ్లీ ఇన్నాళ్లకు ఈ జంట కలిసి నటిస్తున్నారు. దీనివల్ల సినిమాపై పాజిటీవ్ వైబ్ క్రియేటవ్వడం ఖాయం.

యాక్షన్.. రొమాన్స్ వెరసి కిస్ కిస్ కిస్సిక్..

సుశాంత్, జాన్య జోషి, విధి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'కిస్ కిస్ కిస్సిక్'. శివ్ హరే దర్శకుడు. గణేష్ ఆచార్య, విధి ఆచార్య నిర్మాతలు. విజయ్‌రాజ్, మురళీ శర్మ, కీలక పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వివిధ భాషల్లో ఈ నెల 21న సినిమాను విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. నిర్మాత గణేశ్ ఆచార్య మాట్లాడుతూ 'ఇది బ్యూటిఫుల్ కాన్సెప్ట్. మైత్రీ బ్లాక్‌బస్టర్ 'పుష్ప2'లోని 'కిస్ కిస్ కిస్సిక్' పాట పల్లవిలోని తొలి పదం మా సినిమా టైటిల్ కావడం ఆనందంగా ఉంది. న్యూటాలెంట్‌ని ఈ సినిమా ద్వారా పరిచయం చేస్తున్నాం. యాక్షన్, రొమాన్స్ అన్నీ ఉన్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది' అని తెలిపారు. 'రషెస్ చూశాను. సినిమా చాలా లావిష్‌గా ఉంది.. మంచి ఎంటర్టైనర్. ఇందులో తొమ్మిది పాటలున్నాయి. వాటిలో అయిదు ట్రెండింగ్‌లో ఉన్నాయి. తప్పకుండా సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది.' అని మైత్రీ అధినేత నవీన్ యెర్నేని ఆశాభావం వెలిబుచ్చారు. ఇంకా ఇందులో నటించిన సుశాంత్, జాన్య జోషి, విధి కూడా మాట్లాడారు.

ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో 'వేద వ్యాస్'?

ఒకనాటి స్టార్ డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి మళ్లీ మెగా ఫోన్ పట్టనున్నారు. కొన్నాళ్లుగా దర్శకత్వానికి ఆయన దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మళ్లీ సరైన కంబ్యాక్ కోసం కాస్త టైమ్ తీసుకొని 'వేద వ్యాస్' పేరుతో ఓ కథ రాసుకున్నారట ఎస్వీ కృష్ణారెడ్డి. స్క్రిప్ట్ వర్క్ కూడా దాదాపు పూర్తి కావొచ్చిందని తెలుస్తున్నది. కథ డిమాండ్ మేరకు చైనా, మలేషియా నుంచి కొత్త నటీనటుల్ని ఈ సినిమాకోసం ఎంచుకునే ప్రయత్నం కూడా కృష్ణారెడ్డి మొదలుపెట్టారట. గతంలో మాదిరిగానే ఈ సినిమాకు కూడా సంగీతం ఆయనే అందిస్తారు. కొత్తవాళ్లతో సినిమాలు తీసి హిట్ కొట్టడంలో కృష్ణారెడ్డి దిట్ట. ఆయన గత చిత్రాలు అందుకు నిదర్శనాలు. ఈ సారి చేయబోయే 'వేదవ్యాస్'తో.. తప్పకుండా హిట్ కొట్టాలనే కసితో ఉన్నారట కృష్ణారెడ్డి. ఈ సినిమా నిర్మాత, నటీనట, సాంకేతిక వర్గానికి సంబంధించిన వివరాలు త్వరలో తెలియనున్నాయి.

రొమాంటిక్ అబ్బాయి.. లవ్లీ అమ్మాయి

ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటిస్తున్న లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. నితిన్, భరత్ కలిసి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ అండ్ మంకీస్ పతాకంపై రూపొందుతోన్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ప్రదీప్, దీపికా జంటను ఓ రౌడీ గ్యాంగ్ వెంబడించడం ఈ పోస్టర్‌లో చూడొచ్చు. వెన్నెల కిశోర్, సత్య, గెటప్‌శ్రీను, మురళీధర్‌గౌడ్, జి.ఎం.సుందర్, జాన్ విజయ్, రోహిణి, ఝాన్సీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎంఎన్ బాలరెడ్డి, సంగీతం: రధ